సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 29 । మార్చి । 2024



మున్సిఫ్ కోర్టుకు వందేళ్లు
నిజాం పాలనకు నిలువుటద్దంగా నిలుస్తున్న లక్సెట్టిపేట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు వందేళ్లు పూర్తి చేసుకుంది. 1924లో ఈ కోర్టు భవనాన్ని ప్రారంభించారు. 10లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:30	శని: 4:50

గరిష్టం/కనిష్టం
39.9 /28.8

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి



ప్రాణహిత నది వద్ద ఎస్పీ సురేశ్‌కుమార్

కౌటాల(సిర్పూర్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది ఒడ్డున ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం పరిశీలించారు. జిల్లాలోకి సరిహద్దు ప్రాంతాల ద్వారా అక్రమంగా మద్యం, నగదు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రాకుండా ముమ్మర తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. వాహనాల తనిఖీ సమయంలో తప్పనిసరిగా వీడియో తీయాలన్నారు. రెవెన్యూ, ఎక్సైజ్, అటవీశాఖ అధికారుల సమన్వయంతో పోలీసులు విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం కౌటాల పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన
సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఎస్పీ సురేశ్ బాబు పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో తాగునీటితో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని సెక్టోరల్ అధికారికి సూచించారు. ఆయన వెంట ఉన్నారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్ పాషా, ఎస్సైలు మధుకర్, దీకొండ రమేశ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



కవాతు చేస్తున్న డీఎస్పీ, పోలీసులు

కెరమెరి(ఆసిఫాబాద్): పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారితోపాటు ప్రధాన వీధుల గుండా గురువారం కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో ఆయన మాట్లాడారు. భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా నగదు, మద్యం తరలించొద్దని సూచించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ఈ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వాంకిడి సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై గుంపుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి కోసం సర్వే

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సుభాష్ రోడ్డు (సంజీవయ్యకాలనీ) వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ ఇంజినీరింగ్ అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. కాగజ్‌నగర్ మండలం బారెగూడ–శివాపూర్ వద్ద అండర్ బ్రిడ్జి పనులు పూర్తి కాగా, ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎంజీ రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తుండగా.. రాకపోకలు పెరిగి ట్రాఫిక్ తీవ్రమైంది. సంజీవయ్య కాలనీ రైల్వేట్రాక్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో విడతల వారీగా సర్వే చేస్తున్నారు ఇళ్లు కోల్పోతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు.

లక్ష్యం చేరని ఉపాధి

- ఈ నెల 31తో ముగియనున్న 2023- 24 ఆర్థిక సంవత్సరం
- నేడు, రేపు మాత్రమే పనులు చేపట్టే అవకాశం
- దాదాపు నాలుగు లక్షల పనిదినాలు వృథా!
- వేసవిలో అందని అదనపు భత్యం
- రెండు నెలల కూలి కూడా పెండింగ్‌లోనే..
- పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపని కూలీలు



తిర్యాణిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): నిరుపేదలకు సంవత్సరంలో వందరోజుల పని కల్పించాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన ఉపాధిహామీ పథకం లక్ష్యం నెరవేరడం లేదు. రెండేళ్లుగా పథకం అమలులో తీసుకువస్తున్న మార్పులు చేర్పులతో కూలీలు అవస్థలు పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ మార్పులు, సిగ్నల్ సమస్యలు వెరసి జిల్లాలో లక్ష్యం మేరకు పని దినాలు పూర్తి చేయడం కష్టంగా మారింది. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో 15 మండలాల పరిధిలో 39,92,603 పని దినాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఆదివారం మినహాయించి ఒకరోజు మాత్రమే గడువు ఉంది. ఇప్పటివరకు 35,73,192 పనిదినాలు పూర్తి చేయగా.. మరో 4,19,411 లక్షల పనిదినాలు పూర్తి చేయడం అసాధ్యం. దాదాపు 4లక్షల వరకు పని దినాలు వృథాగా మారనున్నాయి.

లక్ష్యం దాటిన మూడు మండలాలు..
జిల్లాలో మొత్తం 1.24 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. 2.48 మంది కూలీలు ఉన్నారు. ఇందులో 93వేల కుటుంబాల్లో 1.74 లక్షల మంది ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2,783 కుటుంబాలు వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాయి. అలాగే మూడు మండలాలు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసి ఆదర్శంగా నిలిచాయి. మారుమూల మండలంగా పేరొందిన తిర్యాణి మండలంలో 2,58,065 పని దినాలు లక్ష్యంగా ఉండగా.. ఇప్పటివరకు 3,13,942 పూర్తి చేశారు. దహెగాంలో 3,48,259 పని దినాలకు 3,60,037 రోజులు, వాంకిడి మండలంలో 2,44,668 రోజులకు 2,64,649 రోజులు పూర్తి చేశారు. మిగిలిన 12 మండలాలు మాత్రం లక్ష్య సాధనలో వెనుకబడ్డాయి. అత్యల్పంగా సిర్పూర్(యూ) మండలంలో 2,88,800 పని దినాలకు కేవలం 1,0716 రోజుల పని పూర్తి చేశారు.

మార్పులు అనేకం.. వేసవి భత్యం మాయం
ఉపాధిహామీ పథకం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండగా కూలీలకు అనేక వెసులుబాట్లు ఉండేవి. వేసవిలో కూలీల సంఖ్యను పెంచేందుకు గత టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20 చొప్పున వేసవి భత్యం పేరుతో పేమెంట్ చేసేందుకు అవకాశం ఉండేది. పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో ఇందుకు సంబంధించి ఎలాంటి ఏర్పాట్లు లేవు. అలాగే ఆన్‌లైన్ హాజరుతో మారుమూల గ్రామాల్లో సిగ్నల్ సమస్య తలెత్తి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాంకేతిక కారణాలతో జాబ్‌కార్డు, ఆధార్ అనుసంధానం కాక చాలా మంది పనులకు దూరమయ్యారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేకపోవడం, రెండు నెలలుగా కూలీలకు నగదు అందకపోవడంతోనూ కూలీలు ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. మొత్తం కూలీల్లో సరాసరి కేవలం 30 శాతం మంది మాత్రమే పనులకు వెళ్తున్నారని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

జిల్లా వివరాలు

2023- 24లో పనిదినాల లక్ష్యం : **39,92,603**

చేపట్టిన పని దినాలు: **35,73,192**

వందరోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు: **2,783**

లక్ష్యం చేరిన మండలాలు: తిర్యాణి, వాంకిడి, దహెగాం

ఏప్రిల్ 1 నుంచి వేతనాల పెంపు
ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీల రోజువారీ వేతనాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2015–16లో రూ.160 ఉన్న కనీస వేతనాన్ని రూ.180కి పెంచారు. 2021– 22లో రూ. 247కు చేరుకోగా.. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా కూలీలకు రూ.272 చెల్లిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అంటే ఏప్రిల్ 1 నుంచి పనులు చేసే వారు రోజుకు గరిష్టంగా రూ.300 పొందే అవకాశం ఉంది. జిల్లాలో దాదాపు 2,48,150 మందికి లబ్ధి చేకూరనుంది.

'ఉపాధి' కల్పించండి..
ఆధార్, జాబ్‌కార్డు అనుసంధానం కాక ఉపాధిహామీ పనులకు దూరమయ్యామని తిర్యాణి మండలం సుంగాపూర్ గ్రామానికి చెంది న కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడారు. జాబ్ కార్డులో పేరు, ఆధార్ నంబర్లు తప్పుగా రావడంతో దాదాపు 20 మంది కూలీలకు సమస్య ఏర్పడిందన్నారు. గతేడాది నుంచి పనుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఆర్థిక సంవత్సరంలోనైనా తప్పులు సరిచేసి పేద కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గం పుల్లుబాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కావడం లేదు..



ఉపాధిహామీ పథకం పనులు ఎక్కువగా నడిచే ఫిబ్రవరి నుంచి జూన్ నెలల్లో కూలీలకు వేసవి భత్యం చెల్లించేవారు. దీంతో పనికి తగిన కూలి లభించేది. ఎండకు ఎంత కష్టపడినా ప్రస్తుతం కేవలం రోజుకు రూ.150 నుంచి రూ.180 వరకు మాత్రమే పడుతున్నాయి. గిట్టుబాటు కాక పనులకు వెళ్లడం లేదు.
– రాయిల్ల నర్సయ్య, ఉపాధిహామీ కూలీ, గోలేటి

కొనుగోళ్లకు సిద్ధం

- జిల్లాలో ఏప్రిల్ 1 నుంచి వరి ధాన్యం కొనుగోళ్లు
- 37 కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- 47 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- వేసవి నేపథ్యంలో వసతులు కల్పించాలని ఆదేశాలు



దహెగాం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం(ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లకు జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇటీవల హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మే 15లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వసతులపై దిశానిర్దేశం చేశారు. వేసవి నేపథ్యంలో రైతులకు నీడ, తాగునీరు, టార్పాలిన్లు, గోనె సంచులతో పాటు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలపై సూచనలిచ్చారు. ఈ క్రమంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సైతం ధాన్యం కొనుగోళ్లపై బుధవారం వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. గతేడాది ఏర్పాటు చేసిన విధంగానే ఈ ఏడాది పీఏసీఎస్, ఐకేపీ సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన కేంద్రాల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నారు.

37 కేంద్రాల్లో కొనుగోళ్లు..
జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రైతులు 19,119 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. దహెగాం, రెబ్బెన, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ మండలాల్లోనే వరి సాగు అధికంగా ఉంది. దాదాపు 47 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన మండలాల పరిధిలో 37 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలు నిర్వహించనున్నారు. జిల్లాలో వరి కోతలు ప్రారంభం కానందున మొదట 12 కేంద్రాలను ప్రారంభించనున్నారు. కొనుగోళ్ల అనంతరం మిల్లులకు ధాన్యం తరలించేందుకు వీలుగా వాహనాలు, రైతులకు అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుతున్నారు.

అకాల వర్షాల ముప్పు
వేసవి నేపథ్యంలో అకాల వర్షాల ముప్పు పొంచి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు అన్నదాతలకు ముందస్తు అవగాహన కల్పించడంతోపాటు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటేనే మేలు. కేంద్రాల ఏర్పాటు, తేమ, మద్దతు ధరపై విస్తృతంగా వారికి అవగాహన కల్పించాలి. ధాన్యం సేకరణపై మహిళా సంఘాలు, పీఏసీఎస్ సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలి. ఆన్‌లైన్ ఎంట్రీల్లో తప్పిదాలు దొర్లితే నగదు అందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అలాగే మార్చిలోనే ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో ఏప్రిల్, మే నెలల్లో కొనుగోళ్లు ముగిసే వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి.

ఏర్పాట్లు చేస్తున్నాం
జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఏప్రిల్ ఒకటి నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తాం. మొదట 12 కేంద్రాలు ప్రారంభించి, అవసరానికి అనుగుణంగా వాటి సంఖ్యను పెంచుతాం. అవసరమైన గోనె సంచులు, రవాణా కోసం వాహనాలు సిద్ధం చేస్తున్నాం.
– నర్సింగరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్

తిరుగుబాటు!

- అన్ని పార్టీలు ఆదివాసీలవైపే మొగ్గు
- టికెట్ ఆశించి భంగపడ్డ బంజారాలు
- బీజేపీలో సిట్టింగ్ ఎంపీకి చుక్కెదురు
- రెబెల్‌గా బరిలో ఉంటానన్న 'సోయం'
- మరోవైపు 'బంజారా గర్జన'కు ప్రణాళిక
- ఆసక్తిగా మారిన పార్లమెంట్ ఎన్నికలు



ఎంపీ సోయం బాపూరావు

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. ఇక వివిధ పార్టీల్లోని అసంతృప్తుల లొల్లి మొదలైంది. పార్టీ టికెట్ దక్కకున్నా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేయాలని భంగపడ్డ నేతలు ప్రకటిస్తున్నారు. టికెట్ దక్కని సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు బీజేపీకి తిరుగుబాటు హెచ్చరికలు జారీ చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తానని స్పష్టం చేశారు. ప్రధాన పార్టీలన్నీ ఆదివాసీ నేతలకే టికెట్లు ఇవ్వగా బంజారా సమాజం గుర్రుగా ఉంది. ఇప్పటికే అన్ని పార్టీల్లోని బంజారా నేతలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చింది. 'బంజారా గర్జన' నిర్వహణకు ప్రణాళిక రచించింది. వివిధ పార్టీల్లో టికెట్లు ఆశించి భంగపడ్డ నేతల్లో ఒకరిని లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దించాలని యోచిస్తోంది.

పోటీకి సై అంటున్న 'సోయం'
బీజేపీ నుంచి మరో సారి టికెట్ ఆశించిన సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు చుక్కెదురైంది. దీంతో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. కమలం పార్టీ అభ్యర్థిగా గోడం నగేశ్ పేరు ప్రకటించిన బీజేపీ ఆయనకు ప్రచారంలో సహకరించాలని ఎంపీ బాపూరావును బుజ్జగిస్తోంది. అయినా ఆయన అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై గురువారం 'సాక్షి' బాపూరావును ఫోన్‌లో పలకరించగా తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఆదివాసీలు ఆరాధించే దువ్వల్ (పులి) గుర్తుపై పోటీ చేస్తానని చెప్పారు. దీంతో బీజేపీ తిరుగుబాటు అభ్యర్థిగా ఆయన బరిలో ఉండడం ఖాయంగా కనిపిస్తోంది.

ఏకతాటిపైకి బంజారాలు..
మరోవైపు ప్రధాన పార్టీల్లో టికెట్ ఆశించిన బంజారా నేతలకు ఆశాభంగం కలగడంతో అంతా ఏకతాటిపైకి రావాలని ఆ సమాజంలోని పెద్దలు పిలుపునిచ్చారు. బీజేపీ నుంచి మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డారు. కాంగ్రెస్ నుంచి ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్, యువజన కాంగ్రెస్ నాయకుడు శ్రావణ్‌నాయక్ తదితరులు టికెట్ ఆశించినా ఫలితం దక్కలేదు. అయితే అన్ని పార్టీలు ఆదివాసీలకే టికెట్ ఇవ్వాలని నిర్ణయించగా లంబాడా నేతల ఆశలు ఆవిరయ్యాయి. వీరంతా బంజారా సమాజం ఇచ్చిన పిలుపునకు స్పందించి బయటకు వస్తారా? లేదా? అనేది వేచిచూడాల్సిందే. కాగా, కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు ఏదైన పదవి ఇస్తామని పార్టీ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని ఆమె వర్గీయులు స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయంపై బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్‌ను 'సాక్షి' ఫోన్‌లో పలకరించిన ప్పుడు తనకు పోటీ చేయాలనే ఆసక్తి లేదని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో మిగతా బంజారా నేతల నిర్ణయం ఎలా ఉంటుందనేది ఆసక్తిగా మారింది. వారంతా ఏకతాటిపైకి వచ్చి ఎవరినైన ఒకరిని బరిలోకి దింపుతారా? లేదా? అనేది 'బంజారా గర్జన'లో తేలనుంది.

శిక్షణ లేకుండానే రోగులకు వైద్యం!

- క్లినిక్‌లో ఓపీ రిజిస్టర్ కూడా నిర్వహించని వైనం
- దహెగాంలో ఆర్‌ఎంపీపై విచారణ చేపట్టిన వైద్యశాఖ
- వివరాలు సేకరించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో



శ్రీఆంజనేయ క్లినిక్‌లో విచారణ చేపడుతున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంనాయక్

దహెగాం(సిర్పూర్): మండల కేంద్రానికి చెందిన గాదం నీలక్క అనే మహిళ వైద్యం వికటించడంతోనే మృతి చెందిందని కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుపై జిల్లా వైద్యశాఖ అధికారులు విచారణ వేగవంతం చేశారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీఆంజనేయ క్లినిక్‌లో వివరాలు సేకరించారు. మూడు రోజుల క్రితం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్పందన విచారణ కోసం వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో క్లినిక్ మూసి ఉండటంతో ఆమె వెనుదిరిగి వెళ్లిపోయారు.

వివరాలు సేకరణ
ఈ నెల 22న గాదం నీలక్క మృతిపై ఫిర్యాదుపై మండల కేంద్రంలోని క్లినిక్‌లో అదనపు డీఎంహెచ్‌వో సీతారాంనాయక్ విచారణ చేపట్టారు. అయితే నీలక్కకు ఎలాంటి వైద్యం అందించలేదని సదరు ఆర్‌ఎంపీ లక్ష్మణ్ రాతపూర్వకంగా అధికారులకు రాసి ఇచ్చాడు. కాగా ఆర్‌ఎంపీగా చలామణి అవుతున్న లక్ష్మణ్‌కు ఎలాంటి శిక్షణ సర్టిఫికెట్ లేదని డిప్యూటీ డీఎంహెచ్‌వో తెలిపారు. ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్‌పై కూడా జారీ తేదీ లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా తెలిసీతెలియని వైద్యం చేయొద్దని సూచించారు. రోగులకు సంబంధించిన ఓపీ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి స్పందన తదితరులు ఉన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సిర్పూర్(టి): సిర్పూర్(టి)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలోని వేంపల్లి రైల్వేగేటు వద్ద నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ వంతెన పనులను గురువారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పరిశీలించారు. బుధవారం నుంచి ప్రారంభమైన బ్రిడ్జి గ్యాడర్ పనుల గురించి వివరాలు తెలుసుకున్నారు. పనులు పూర్తి చేసి ప్రజలకు బ్రిడ్జిని అందుబాటులోకి తేవాలని రైల్వే అధికారులకు సూచించారు. సిర్పూర్(టి)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారికి సైతం నిధులు త్వరలోనే మంజూరవుతాయని తెలిపారు.

రెండు రోజుల్లో తాగునీరు సరఫరా చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- 'తాగునీటి కష్టాలు' కథనానికి స్పందన
- ఎనోలి కొలాంగూడ గ్రామంలో నీటి సమస్యపై ఆరా

సాక్షి ఎఫెక్ట్

వాంకిడి(ఆసిఫాబాద్): ఎనోలి కొలాంగూడలో తాగునీటి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించి భగీరథ నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. ఈ నెల 17న సాక్షి దినపత్రికలో 'తాగునీటి కష్టాలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి గ్రామంలో పర్యటించారు. మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించి నాలుగేళ్లవుతున్నా నీటి సరఫరా ఎందుకు ప్రారంభించలేదని అధికారులను ప్రశ్నించారు. లీకేజీలు గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, స్థానికంగా నీటి సంపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామానికి అధికారులెవరూ రారని, అరకొర వసతులతో కాలం వెల్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ బెండార, వాంకిడి జీపీల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్డీవో సురేందర్‌తో కలిసి తనిఖీ చేశారు. పోస్టర్ సిబ్బంది అకౌంట్లలో డబ్బులు ఉన్నా ఇవ్వడం లేదని, లాక్‌పడిన ఖాతాలను అన్‌లాక్ చేయడం లేదని కూలీలు ఆరోపించారు. సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, తహసీల్దార్ రోహిత్, ఎంపీవో ఖాజా అజీజుద్దిన్, ఏపీవో శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి
ఆసిఫాబాద్‌అర్బన్: వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీపీవో భిక్షపతిగౌడ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. చేతిపంపులు, పంపు సెంట్లు, మిషన్ భగీరథ పైపులకు మరమ్మతులు చేపట్టి.. అన్ని నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేయాలన్నారు. నీటి ఎద్దడి ఉన్నచోట పంచాయతీ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 31లోగా వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు వందరోజుల పని దినాలు కల్పించాలన్నారు.

గ్యారంటీల పేరుతో గారడి చేస్తున్న సీఎం

- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పక్కన ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

కాగజ్‌నగర్‌రూరల్: వంద రోజుల్లో ఆరు గ్యారంటీల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి గారడి చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత, ఆ పార్టీ నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం నిర్వహించిన సిర్పూర్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి హాజరయ్యారు. కాంగ్రెస్‌ను ఎవ్వరూ నమ్మడం లేదని, హామీలు అమలు చేయలేకే ఆ పార్టీ నాయకులు ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బహుజనవాదం, తెలంగాణ వాదం రెండు ఒక్కటేనని స్పష్టం చేశారు. ఈ వాదనలను బీజేపీ ఖూనీ చేస్తుందన్నారు. రాజ్యాంగ హక్కులు కాపాడటం కోసమే బీఆర్‌ఎస్‌లో చేరినట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు అబ్దుల్ కలాం, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కర్ణమామిడి శివారులో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3,600 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత



తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని అచలాపూర్ గ్రామానికి ఉపాధి నిమిత్తం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన రాజేశ్‌కుమార్ కుమారుడు సుశాంత్ కుమార్ (2) గురువారం తప్పిపోయాడు. తల్లిదండ్రులు 100కు ఫోన్‌చేయగా స్పందించిన తాండూర్ పోలీసులు అచలాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారి వెంట వెతికారు. బాలుడు గ్రామ శివారులో నడుచుకుంటూ వెళ్తుండగా పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులను పలువురు అభినందించారు.

ఆర్థో జాయింట్ ఆయిల్ సీజ్



సీజ్ చేస్తున్న అధికారులు

మంచిర్యాలటౌన్: పక్షవాతం, రుమటాయిడ్, ఆర్థరైటిస్ వంటి వ్యాధులు తగ్గిస్తుందంటూ మోసపూరిత ప్రకటనలు చేస్తూ విక్రయిస్తున్న ఆర్థోజాయింట్ ఆయిల్‌ను సీజ్ చేసినట్లు డ్రగ్స్ అధికారులు తెలిపారు. కరీంనగర్ నుంచి ఏడీ ఎం.శ్రీనివాసులు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ టి.చందనలు గురువారం జిల్లా కేంద్రంలోని పలు ఆయుర్వేద షాపులలో తనిఖీలు నిర్వహించారు. అమ్మకానికి ఉంచిన ఆర్థోజాయింట్ ఆయిల్‌ను సీజ్ చేయడంతో పాటు, ఆ కంపెనీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

జైనూర్(ఆసిఫాబాద్): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. గురువారం మండలంలోని జంగాం వద్ద నిర్వహించిన తనిఖీల్లో ముగ్గురు వాహనదారుల నుంచి రూ.1.31 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మున్సిఫ్ కోర్టుకు వందేళ్లు



నిజాం కాలంలో నిర్మించిన మున్సిఫ్ కోర్టు భవనం

- నిజాం కాలంలో కోర్టు భవన నిర్మాణం
- శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబు

లక్సెట్టిపేట(మంచిర్యాల): నిజాం పాలనకు నిలువుటద్దంగా నిలుస్తున్న మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు వంద సంవత్సరాల్లోకి అడుగుపెట్టింది. నిజాం ప్రభువులు ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, నిర్మల్, లక్సెట్టిపేట, చెన్నూర్, ఆసిఫాబాద్ తాలూకా కేంద్రాల్లో కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రతీకోర్టులో ఉర్దు భాషలో శిలాఫలకం రాసి ఉంటుంది. లక్సెట్టిపేటలో నిర్మించిన మున్సిఫ్ కోర్టు భవనాన్ని 1924, నవంబర్ 5న అప్పటి జడ్జి మౌలాలి సయ్యద్ యూసుఫ్ అలీ ప్రారంభించారు. నిజాం కాలంలో నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులు చేయించి సబ్‌జైల్‌కు కేటాయించారు. భవనాన్ని ప్రస్తుతం అండర్ ట్రయల్ ఖైదీలకోసం వినియోగిస్తున్నారు. మున్సిఫ్ కోర్టు పక్కనే స్థలం కేటాయించి పక్కా భవనం నిర్మించారు. 1985 ఫిబ్రవరి 3న అప్పటి జిల్లా జడ్జి కె.బి సిద్దప్ప, మున్సిఫ్ కోర్టు జడ్జి అహ్మద్ జియాస్‌ఖాన్ కోర్టు భవనాన్ని ప్రారంభించారు. నిజాం కాలం నాటి మున్సిఫ్ కోర్టుకు వందేళ్లు పూర్తి కావడంతో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు

మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు భవనం నిర్మించి వందేళ్లు కావస్తున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ కోర్టు ఆవరణను శుభ్రం చేయిస్తున్నారు. ముస్తాబు చేయిస్తున్నారు. వేడుకల్లో భాగంగా ప్రతీ శనివారం జడ్జీలు, సీనియర్ న్యాయవాదులు చట్టాలపై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేడుకలు ఘనంగా నిర్వహించాలని పట్టణవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి



1977లో హైదరాబాద్‌లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసి ఇక్కడి కోర్టులోనే న్యాయవాదిగా విధులు నిర్వర్తించా. కోర్టు ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తి అయ్యింది. ఇక్కడి కోర్టులో చాలా కేసులు పరిష్కారమయ్యాయి. శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి.

– చోరగుడి ప్రభాకర్, సీనియర్ న్యాయవాది, లక్సెట్టిపేట

ఏర్పాట్లు చేస్తున్నాం



మున్సిఫ్ కోర్టుకు వందేళ్ల చరిత్ర ఉంది. శతాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం రినోవేషన్ వర్క్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వేడుకలు ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్ అసదుల్లా షరీఫ్, జూనియర్ సివిల్ జడ్జి, లక్సెట్టిపేట

‘కవ్వాల్’లో ట్రెయినీ బీట్ అధికారులు



డాగ్ స్క్వాడ్ గురించి తెలుసుకుంటున్న ట్రెయినీ బీట్ అధికారులు

- శిక్షణలో భాగంగా మూడు రోజులపాటు పర్యటన
- డివిజన్‌లోని పలు విషయాలు వివరించిన అధికారులు

జన్నారం(ఖానాపూర్): దూలపెల్లి ఫారెస్ట్ అకాడమీకి చెందిన 34 వ బ్యాచ్ శిక్షణ బీట్ అధికారులు 49 మంది కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం, తాళ్లపేట్ అటవీరేంజ్‌ల పరిధిలో మూడు రోజుల పాటు పర్యటించారు. ఆయా ప్రాంతాలలోని గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు, వేసవిలో నీటి ఇబ్బంది రాకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్లగ్ మార్కులు గుర్తించే విధానం, తదితర అంశాలను పరిశీలించారు. రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, లక్ష్మీనారాయణ వారికి ఇక్కడి విశేషాలను, స్మగ్లింగ్ నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అడవిలో అభివృద్ధి గురించి వివరించారు. రోజుకు 7 కిలోమీటర్ల దూరం అడవిలో ట్రెక్కింగ్ చేశారు. రాత్రి పూట తపాలాపూర్ చెక్‌పోస్టు వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. డివిజన్ కేంద్రంలో డాగ్‌స్క్వాడ్ గురించి, చీతా డాగ్‌స్క్వాడ్ ద్వారా నేరస్తులను పట్టుకున్న విధానం డాగ్‌స్క్వాడ్ బీట్ అధికారి శ్రీనివాస్ వారికి వివరించారు. దూలపెల్లి అకాడమీ నుంచి తిప్పేశ్వర్, ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాలలో పర్యటించి ఈ నెల 26న జన్నారం చేరుకున్నారు. మూడురోజులు అడవిలో పర్యటించామని, శుక్రవారం దూలపెల్లి వెళ్తామని టూర్ ఆఫీసర్ పద్మ తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలకరించిన ‘సాక్షి’తో పలువురు బీట్ అధికారులు తమ అనుభవాలను పంచుకున్నారు.

అనేక విషయాలు తెలుసుకున్నాం



శిక్షణలో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌కు వచ్చాం. రెండు రోజుల్లో ఇక్కడ అనేక విషయాలు తెలుసుకున్నాం. తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని తపాలాపూర్ చెక్‌పోస్టు వద్ద రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాం. స్మగ్లింగ్ నిరోధంపై తీసుకుంటున్న చర్యలపై ఇక్కడి అధికారుల ద్వారా తెలుసుకున్నా.

– బీ.శేఖర్, ఎఫ్‌బీవో, కామారెడ్డి డివిజన్

చాలా ఆనందంగా ఉంది



శిక్షణలో భాగంగా ప్రత్యక్ష పద్ధతుల ద్వారా నేర్చుకునేందుకు జన్నారం అటవీ డివిజన్‌కు వచ్చాం. రెండు రోజులు ఇక్కడే బస చేశాం. రోజూ ఉదయాన్నే ఏడు కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేశాం. అడవిలో జరుగుతున్న అభివృద్ధి, అడవుల రక్షణ, జంతువుల ప్లగ్ మార్కింగ్‌లను పరిశీలించాం. నేరుగా అనేక వన్యప్రాణులను చూశాం. చాలా ఆనందంగా ఉంది.

– బీ.రవి, ఎఫ్‌బీవో, కొత్తగూడెం డివిజన్

ఇక్కడి విషయాలు వివరించాం



శిక్షణలో భాగంగా దూలపెల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి 49 మంది శిక్షణ బీట్ అధికారులు ఇక్కడి విషయాలు తెలుసుకునేందుకు వచ్చారు. ఇక్కడ మేము చేపడుతున్న చర్యలు, అభివృద్ధి, అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు, తదితర అంశాల గురించి వారికి వివరించాం. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాం.

– హఫీజొద్దీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

సీఎండీని కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేర్చాలని, కోలిండియా మాదిరి పెర్క్స్‌పై ఆదాయపన్ను కంపెనీ భరించాలని, సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

మంత్రిని కలిసిన నాయకులు

సీఎండీతో భేటీ అనంతరం ఐఎన్టీయూసీ నాయకులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. సింగరేణి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

నస్పూర్: పట్టణ పరిధిలో వెలిసిన అక్రమ కట్టడాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రవికుమార్, టీపీఎస్ ఆర్.సతీష్‌ల ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో గురువారం కూల్చివేయించారు. నస్పూర్ శివారు సర్వే నంబర్ 24లో సెట్ బ్యాక్ లేని కారణంగా నాలుగు ఇంటి నిర్మాణాల పిల్లర్లను, సర్వే నంబర్ 42లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని, సర్వే నంబర్ 11లో అనమతి లేని వెంచర్ హద్దురాళ్లను, శ్రీరాంపూర్ ఏరియా కొత్తరోడ్డులో వెలసిన రెండు షెడ్లను తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మామంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



కూల్చివేయిస్తున్న డీటీఎఫ్ టీం సభ్యులు

గోడ గడియారాలు, మద్యం స్వాధీనం

మందమర్రిరూరల్(చెన్నూర్): పట్టణంలోని సీఈఆర్ క్లబ్ సమీపంలో ఉన్న సీ–13 క్వార్టర్‌లో ఎన్నికల ఎఫ్ఎస్‌టీ మున్సిపల్ ఏఈ అచ్యుత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దాడుల్లో 32 గోడ గడియారాలు, 130 రాయల్ స్టాగ్ క్వాటర్ బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం, గోడ గడియారాలు నిల్వచేశారని తమకు అందిన సమాచారం మేరకు బెల్లం అశోక్ ఇంట్లో దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ ముస్తాఫా ఇంట్లో దాడి చేసి 75 బాటిళ్ల మద్యం పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మందమర్రిలోని పలువురి బీఆర్ఎస్ నాయకులు ఎవరింట్లో ఎన్ని బాటిళ్లు అన్‌లోడ్ చేశారనే వివరాలతో కూడిన కాగితం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు పోలీసులకు వాట్సాప్ చేసినట్లు సమాచారం.



పట్టుకున్న మద్యం, గోడ గడియారాలు

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా అశ్విన్‌రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న అశ్విన్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: భారతీయ జనతా యువమోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా బొలిశెట్టి అశ్విన్‌రెడ్డిని నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి గురువారం నియామక పత్రం అందజేశారు. అశ్విన్ రెడ్డి గతంలో ఏబీవీపీ జోనల్ ఇన్‌చార్జిగా, నగర కార్యదర్శిగా, జిల్లా కోకన్వీనర్, కన్వీనర్‌గా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.

‘ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి’

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కార్మికులకు కేటగిరీ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు కే.వీరభద్రయ్య ముస్కె సమ్మయ్య, ఎస్కె బాజీసైదా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2022–23 సంవత్సరానికి సంబంధించిన క్యాటగిరీ ప్రమోషన్లు 2023 సెప్టెంబర్ నాటికి ఇవ్వాల్సి ఉండగా యాజమాన్యం ఇప్పటికీ ఇవ్వడం లేదన్నారు. ఫలితంగా కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రమోషన్లు ఇవ్వాలని, లేనియెడల యూనియన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బీపీఏలో పర్యటించిన డైరెక్టర్



క్వారీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఖైరిగూడ ఓసీపీని సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఓసీపీ పరిసరాల్లో చేపడుతున్న సివిల్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఎండల తీవ్రత అధికమవుతున్న తరుణంలో ఉపశమన చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం రవిప్రసాద్, పీవో సత్యనారాయణ, ఏజీఎం తిరుమల్‌రావు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



కేకే-5గనిపై సింగరేణి డైరెక్టర్

మందమర్రిరూరల్(చెన్నూర్): కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మందమర్రి ఏరియా జీఎం మనోహర్‌తో కలిసి కేకే–5 గనిలో దిగి పని ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం కేకే ఓసీ గనిని సందర్శించారు. ఆయన వెంట కేకే–5 గని మేనేజర్ అల్లావుద్దీన్, కేకే–ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్అర్బన్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రీజనల్ న్యూస్ యూనిట్, దూరదర్శన్ కేంద్ర స్ట్రింగర్ల ఎంప్యానల్‌మెంట్ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎన్‌యూ హెడ్ సంయుక్త సంచాలకులు (వార్తలు) రాహుల్ గొలికర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులకు ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకోసం ఆన్‌లైన్‌లో www.prasarbharati.gov.in/pbvacancies వెబ్‌సైట్‌లోసంప్రదించాలనిసూచించారు.

మాల మహానాడు కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రం అందిస్తున్న లక్ష్మణ్

పాతమంచిర్యాల: మాల మహానాడు కార్యవర్గాన్ని గురువారం జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ సమక్షంలో ఎన్నుకున్నారు. మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడిగా గరిసే స్వామి, పట్టణ ఉపాధ్యక్షుడిగా నీరటి నర్సయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జై భీం సైనిక్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్తెపు శంకర్, ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు



శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాకు చెందిన ఐఎన్టీయూసీ నాయకులు గురువారం ఏరియా ఫార్మేషన్ కమిటీ నాయకులు సిద్దంశెట్టి రాజమౌళి ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్‌ను హైదరాబాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి ఉద్యోగుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి, ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, నాయకులు సంగెం ప్రకాష్‌రావు, రామారావు, శ్రీనివాస్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుల మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



పవన్ (ఫైల్)



సాయిచరణ్ (ఫైల్)

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌లో విషాదం

ఉట్నూర్‌రూరల్/లింగాపూర్: ఉట్నూర్ మండలం పెర్కగూడ సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న ఘటనలో కుమురంభీం జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రులు ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి బుధవారం రాత్రి జాదవ్ సాయిచరణ్(19), కొదురుపాక పవన్ (18) మృతి చెందారు. సాయికుమార్ చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.

లింగాపూర్‌లో విషాదఛాయలు...

శుభకార్యానికి వచ్చి తిరిగి లింగాపూర్‌కు వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాయిచరణ్, కొదురుపాక పవన్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. జాదవ్ రమేశ్–విజయ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు జాదవ్ సాయిచరణ్ ఢిల్లీలో జేఈఈ కోచింగ్ తీసుకుని పరీక్షలో పాసై వారం కిందటే ఇంటికి వచ్చాడు. రాయమల్లు–లావణ్య దంపతుల రెండో కుమారుడు కొదురుపాక పవన్ కుమార్ ఇంటర్మీడియట్ చదివి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శుభకార్యానికి వచ్చి వెళ్తూ ఈ ప్రమాదానికి గురై మృతి చెందడంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

పశువుల వాహనం ఢీకొని ఒకరు మృతి



ప్రభాకర్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): పశువులు తరలిస్తున్న ఐచర్ వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఇంద్రానగర్‌కు చెందిన కార్పెంటర్ జంబోజు ప్రభాకర్ (66) బుధవారం లక్ష్మీనగర్‌కు పనికి వెళ్లి రాత్రి ఇంటికి కాలినడకన వెళ్తుండగా పాత జీఎంఆర్ జిన్నింగ్ మిల్ సమీపంలో మహారాష్ట్ర వైపు నుంచి పశువుల లోడ్‌తో వస్తున్న ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సత్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

19 పశువులు గోశాలకు తరలింపు

వాహనాన్ని అదుపులోకి తీసుకుని అందులో ఉన్న 19 పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించారు. హైదరాబాద్‌కు చెందిన ఐచర్ డ్రైవర్ మహ్మద్ సర్దార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతులకు సత్కారం



రైతును సన్మానిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: జగిత్యాలలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘంలో ఉమ్మడి జిల్లా రైతులకు గురువారం సత్కారం జరిగినట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ తెలిపారు. సేంద్రియ పద్ధతిలో వరి, పెసర, మినుము పంటలు సాగుచేస్తూ నూతన రకాలకు ప్రాచుర్యం కల్పించడంలో ప్రత్యేక కృషి చేసినందుకు కాసిపేట మండలం సంద్రోనిపల్లికి చెందిన రైతు పెంటయ్యను, కృషి విజ్ఞాన శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ సాగులో అధిక దిగుబడులు సాధించినందుకు కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్‌కు చెందిన వడాయి శంకర్‌ను విశ్వవిద్యాలయం అధికారులు శాలువా, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పీజేటీఎస్ఏయూ రిజిస్ట్రార్ వెంకటరమణ, పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు సుధారాణి, సహ పరిశోధన సంచాలకులు శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

నస్పూర్: చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ మంచిర్యాల మొదటి అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఉష నిషధ్వని గురువారం తీర్పునిచ్చారు. పట్టణ పరిధిలోని తీగల్ పహాడ్‌కు చెందిన రాజవరపు వెంకటేశ్వర్లు సీసీసీలోని ప్రశాంత్ నగర్‌లోని ఓ ఇంట్లో 2023 మార్చిలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంచిర్యాల కోర్టులో పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాహెన్ సుల్తానా సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.